# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 16 ఫిబ్రవరి 2026 | సంపుటి: 22 | సంచిక: 143 | వెల: రూ.7 | పేజీలు: 12+12

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## వేములవాడలో ఘనంగా మహాశివరాత్రి

**పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం**



మహా శివరాత్రి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీరాజరాజేశ్వరస్వామితో పాటు అనుబంధ ఆలయమైన భీమేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున భీమేశ్వరస్వామి వారికి పట్టువస్త్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్ సమర్పించారు.

**- వేములవాడ, ఫిబ్రవరి 15 (నినాదం)**



## కర్ణాటక కాంగ్రెస్‌లో ఆశ్చర్యకరమైన సంఘటన

2

**సిద్ధరామయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన డీకే శివకుమార్**

కర్ణాటక రాజకీయాల్లో డీకే శివకుమార్, సిద్దరామయ్య మధ్య సీఎం పదవి కోసం గత కొంత కాలంగా ఒక రకమైన పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో, తాజాగా ఓ ఆశ్చర్యకరమైన సంఘటన చోటుచేసుకుంది. కర్ణాటకలోని హావేరీలో జరిగిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య నిలువెత్తు విగ్రహాన్ని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్వయంగా ఆవిష్కరించారు.

**-బెంగళూరు (నినాదం)**

## హంగ్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ అరాచకం

**కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తున్నారంటూ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్**



- **34 మున్సిపాలిటీల్లో అధికారం కోసం కాంగ్రెస్ అడ్డదారులు తొక్కుతోందంటూ విమర్శలు**
- **కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తూ, ప్రలోభాలకు గురిచేస్తోందని కేటీఆర్ ఆరోపణ**
- **సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసమే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు**

2

రాష్ట్రంలో ఇటీవల ఎన్నికలు జరిగిన మున్సిపాలిటీల్లో హంగ్ ఏర్పడిన 34 చోట్ల అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. కౌన్సిలర్లను కిడ్నాప్ చేయడం, ప్రలోభ పెట్టడం, ఇళ్లకు పోలీసులను పంపడం, గూండాలను ఉపయోగించడం వంటి చర్యలకు దిగుతోందని ఆయన విమర్శించారు.

**- హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నినాదం):**




# పల్లెలతో పాటు పట్టణాలూ... కాంగ్రెస్ వైపే

## 88 స్థానాల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యత

## కనుచూపు మేరలో కూడా కనిపించని ప్రతిపక్ష పార్టీలు

**పల్లెలతో పాటు పట్టణాల్లోనూ ఓటర్లు కాంగ్రెస్ కే పట్టం కట్టారు. వరుసగా వచ్చిన అన్ని ఎన్నికల్లోనూ హస్తం హవా పెరుగుతూ వస్తోంది. అసెంబ్లీ ఎన్నికల నుంచి మధ్యలో వచ్చిన ఉప ఎన్నికలు.. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికలు.. తాజాగా పురపాలక, నగర పాలక ఎన్నికల్లోనూ రాష్ట్రంలోని ఓటర్లు కాంగ్రెస్ కు బ్రహ్మ రథం పట్టారు.**

***-హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 15 (నినాదం)***




రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో 88 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యత సాధించింది. ప్రతిపక్ష పార్టీలు కనుచూపు మేరలో కూడా కనిపించని విధంగా రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ఓటర్లు ప్రజా ప్రభుత్వం పాలనకు మొగ్గు చూపారు. అన్ని జిల్లాల్లోనూ అధికార పార్టీకే జై కొట్టారు. 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగితే 4 చోట్ల కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్నిప్రదర్శించింది. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులే ఎక్కువ డివిజన్లను సాధించారు. కొత్తగూడెం కార్పొరేషన్లో కూడా మొత్తం 60 వార్డులలో కాంగ్రెస్ 22 సీట్లు గెలుచుకుంది. మాతో పాటు మిత్రపక్షంగా ఉన్న సీపీఐ కూడా 22 సీట్లు గెలుచుకుంది. మిగతా పార్టీలు, ఇండిపెండెంట్లు కలిసి మిగతా స్థానాలు గెలుచుకున్నారు. నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో బీజేపీ కొంతమేర ఆధిక్యంలో ఉంది. స్వల్ప తేడాతో కాంగ్రెస్ రెండో స్థానంలో ఉన్న విషయం గమనార్హం. ఎన్నికలు జరిగిన అన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించారు. ఓటర్లందరూ

**...మిగతా 2లో**

## పాలకుడిని కాదు.. సేవకుడిని

**సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారు**

**సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

2



సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సభలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తాను పాలకుడు కాదని, సేవకుడినని స్పష్టం చేశారు. "నేనే రాజు, నేనే మంత్రి" అనే వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకుంటున్నారని, అది మున్సిపల్ ఎన్నికల ఫలితాలకు తన బాధ్యతను సూచిస్తుందని వివరించారు. **- హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నినాదం):**



## మా డబ్బు, గిఫ్ట్‌లు మాకివ్వండి

2

**ఇంటింటికి వెళ్లి అడుగుతున్న ఓడిపోయిన అభ్యర్థులు**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోయిన కొందరు అభ్యర్థులు తాము పోలింగ్‌కు ముందు పంచిన నగదు, చీరలు, ఇతర బహుమతులు ఇవ్వాలంటూ ఓటర్లను అడగటం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేయడానికి డబ్బుతో పాటు ఇతర బహుమతులు పంచుతుంటారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మూడుచింతలపల్లి పొన్నాల వార్డులో ఓ అభ్యర్థి తాను పంచిన వాటిని తిరిగివ్వాలని ఓటర్లను అడుగుతున్నారు.

**-హైదరాబాద్ (నినాదం)**



## శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

2

**బాంబు లభ్యం కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్న అధికారులు**

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు వచ్చింది. ఈ మేరకు మెయిల్ ద్వారా బెదిరింపు అందింది. ఆదివారం ఉదయం సింగపూర్–హైదరాబాద్ విమానంలో బాంబు పెట్టినట్లు మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శంషాబాద్ విమానాశ్రయంలో విమానం ల్యాండ్ కాగానే ప్రయాణికులను కిందకు దింపి, తనిఖీలు చేపట్టగా, బాంబు లభ్యం కాలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

**-హైదరాబాద్ (నినాదం)**



## కాంగ్రెస్‌లోకి ఐదుగురు స్వతంత్ర కార్పొరేటర్లు

2

**మంత్రి పొంగులేటి సమక్షంలో చేరిక**

## పైసల సంచి... అభ్యర్థులను ముంచి!

**ఎమ్మెల్సీ వ్యవహారం విమర్శల దుమారం**

**తిట్టుకున్న ఎల్ రమణ, విద్యాసాగర్ రావు .. జగిత్యాల బిఆర్ఎస్‌లో పైసల పంచాయితీ**

2





(ఫైల్ ఫోటో)

ధృతరాష్ట్ర కౌగిలి చూసేవారికి బాగానే ఉంటుంది. కౌగిలిలో బందీ అయిన వారికే బాధ తెలుస్తుంది. జగిత్యాల టిఆర్ఎస్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. మున్సిపల్ ఎన్నికలవేళ పార్టీ అధ్యక్షులు విద్యాసాగర్ రావు కు ఎమ్మెల్సీ ఎల్ రమణకు మధ్య పైసల సంచి పెద్ద వివాదాన్ని సృష్టించింది. అభ్యర్థులను ఓటమి వైపు నెట్టింది. పార్టీకి మంచిపట్టున నియోజకవర్గం లో పైసల వివాదం వల్ల టిఆర్ఎస్ అభ్యర్థులు ఓటమి మూట కట్టుకున్నారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులను ముందుండి నడిపించాల్సిన నాయకత్వం పార్టీ పంపిన పైసల కోసం తగులాటలో పుణ్యకాలం గడిచింది.. బరిలో నిలబడ్డ అభ్యర్థులు ఆగమయ్యారు. ఎక్కడిది పైసల సంచి.. ఎందుకు తగులాట.. చూద్దాం.

**- జగిత్యాల ప్రతినిధి ఫిబ్రవరి 15 (నినాదం)**



## గవర్నర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. డీఎంకే నేతకు మూడేళ్ల జైలు

2




## ఆధ్యాత్మిక అజ్ఞానమా?

# అధికార గర్వమా?

### ఆదిమ సంస్కృతిపై దాడిని సహించేనా!

**(సమత సాక్షిగా అసమానత్వమా? కాదా ..వనదేవతలపై జీయర్ వ్యాఖ్యల వెనుక అసలు రంగు!..శంకరాచార్యుల నుంచి సమ్మక్క దాకా.. అందరినీ తక్కువ చేసే అహంకారం ఎవరిది? దేవుళ్లకు సర్టిఫికెట్లు ఇచ్చే అధికారం మీకెవరు ఇచ్చారు?)**



**భారతదేశం అనే మహావృక్షానికి మూలవాసులైన ఆదివాసీలే ప్రాణ వాయువు వంటి వేళ్లు అని, నాగరికత ముసుగులో మనం నేడు అనుభవిస్తున్న కృత్రిమ సౌకర్యాల కంటే ఎంతో ముందే ప్రకృతిని పరమాత్మగా, అడవిని కన్నతల్లిగా, ప్రతి చెట్టును ఒక దైవంగా ఆరాధించిన గొప్ప సంస్కృతి గిరిజనులదని ప్రపంచమంతా కొనియాడుతుంటే, ఆధ్యాత్మిక గురువుగా చలామణి అవుతున్న త్రిదండి చిన జీయర్ స్వామి వంటి వారు అహంకారపూరిత వ్యాఖ్యలతో ఆ పునాదులను కించపరచడం అక్షరాలా సామాజిక విద్రోహమే అవుతుంది.**

ఎడిటోరియల్

ముచ్చింతల్ ఆశ్రమంలో కోట్లాది రూపాయల వ్యయంతో 'సమతా మూర్తి' విగ్రహాన్ని నెలకొల్పి, లోకమంతా సమానత్వమే అని ప్రసంగాలు దంచికొట్టే వ్యక్తి, మరోవైపు అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని, వారి వేల ఏళ్ల నాటి విశ్వాసాలను కాలరాసేలా "అడవి దేవతలకు ఇక్కడ స్థలమా? వారు అసలు దేవతలేనా?" అని ప్రశ్నించడం ఆయనలోని ఆధ్యాత్మిక అంధకారాన్ని, వర్ణ వివక్షను స్పష్టం చేస్తోంది. సమ్మక్క–సారలమ్మలు అంటే కేవలం మట్టి గడ్డలు కాదని, వారు అన్యాయమైన పన్నుల విధానానికి వ్యతిరేకంగా, కాకతీయ సామ్రాజ్యపు అరాచక సైన్యాన్ని ఎదిరించి, తమ జాతి అస్తిత్వం కోసం రణరంగంలో రక్తాన్ని ధారబోసిన వీరవనితలని కనీస చరిత్ర కూడా తెలియకుండా మాట్లాడటం ఆయన పీఠానికి ఉన్న గౌరవానికే భంగకరం. ఆసియాలోనే అతిపెద్ద జనసందోహం తరలి వచ్చే మేడారం జాతరను ఒక చిన్నచూపుతో చూడటం, కోట్లాది మంది భక్తుల మనోభావాలను గాయపరచడం ముమ్మాటికీ రాజ్యాంగ విరుద్ధమైన చర్యే కాకుండా, ఆదివాసీల ఉనికిపై జరుగుతున్న సాంస్కృతిక దాడి అని మనం గుర్తించాలి. పైడిరాజు నుంచి సమ్మక్క వరకు, గిరిజన తెగలు అత్యంత భక్తితో ఆరాధించే దేవతలకు "దేవతా హోదా" ఇచ్చే సర్టిఫికెట్లు జారీ చేసే అధికారం ఏ పీఠాధిపతికి లేదని, భక్తి అనేది అంతరాత్మకు సంబంధించిన విషయమే తప్ప అది ఎవరి అబ్బసొత్తు కాదని ఈ సందర్భంగా గట్టిగా చెప్పక తప్పదు. ఆదిశంకరాచార్యుల వంటి మహనీయులనే వ్యాకరణం రానివాడని, ఆయన స్థాపించిన పీఠాలు నకిలీవని తక్కువ చేసి మాట్లాడే సాహసం చేస్తున్నారంటే, ఆయనకు అధికార బలం, రాజకీయ అండదండలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఆధ్యాత్మికత అనేది మనుషుల మధ్య అంతరాలను తగ్గించాలే తప్ప, ఇలా వర్గాల మధ్య చిచ్చు పెట్టి, ఒకరిని గొప్పగా, మరొకరిని తక్కువగా చూపేలా ఉండకూడదు. ప్రభుత్వం ఈ విషయంలో మౌనం వహించడం వల్లనే ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం అవుతున్నాయని, చట్టం ముందు అందరూ సమానమే అన్న సూత్రాన్ని విస్మరించి పాలకులు స్వాముల కాళ్ల దగ్గర మోకరిల్లడం వల్ల సామాన్య ప్రజల, ముఖ్యంగా ఆదివాసీల ఆత్మగౌరవం బజారున పడుతోందన్నది కాదనలేని సత్యం. ఏ పీఠంపై కూర్చుంటే ఏం లాభం, మనసులో మాలిన్యం, మాటలో అహంకారం నిండినప్పుడు అది ఆధ్యాత్మికత కానేరదు. సమ్మక్క–సారలమ్మలు ఎవరో తెలియక, వారు కేవలం "అడవి దేవతలు" అని ఈసడించుకోవడం చినజీయర్ స్వామి వంటి వారి అపరిపక్వ జ్ఞానాన్ని సూచిస్తోంది. మేడారం జాతర అనేది కేవలం ఒక వేడుక కాదు. అది అన్యాయానికి వ్యతిరేకంగా సాగిన పోరాట వారసత్వం. కోట్లాది మంది భక్తులు కులమతాలకు అతీతంగా తరలివచ్చే ఆ పవిత్ర స్థలాన్ని అవమానించడం అంటే, తెలంగాణ అస్తిత్వాన్ని, గిరిజన తెగల సంస్కృతిని అవమానించడమే. ఇలాంటి ఉదంతాల్లో సామాన్య వ్యక్తులపై వెంటనే కేసులు నమోదు చేసే యంత్రాంగం, ఒక కార్పొరేట్ స్థాయి ఆధ్యాత్మిక సామ్రాజ్యాన్ని నడుపుతున్న వ్యక్తి విషయంలో ఎందుకు మెతకవైఖరి ప్రదర్శిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎస్సీ, ఎస్టీ చట్టం లేదా అట్రాసిటీ చట్టం ప్రకారం, ఒక వర్గం యొక్క ఆచారాలను లేదా నమ్మకాలను బహిరంగంగా కించపరచడం శిక్షార్హమైన నేరం అని చట్టాలు ఘోషిస్తున్నా, చర్యలు ఎందుకు శూన్యం?

ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆదివాసీ సంఘాల డిమాండ్ మేరకు ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ జరపాల్సిన అవసరం ఉంది. రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత భక్తిని పక్కన పెట్టి, రాజ్యాంగ రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. వందల కోట్ల సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న చినజీయర్ స్వామి నేపథ్యం చూస్తే, ఆయన ఎదుగుదల వెనుక కేవలం ఆధ్యాత్మికత మాత్రమే కాకుండా భారీ రాజకీయ, కార్పొరేట్ అండదండలు ఉన్నట్లు కనిపిస్తోంది. నిజమైన ఆధ్యాత్మిక వేత్తకు ఉండాల్సిన లక్షణం వినయం, కానీ చిన జీయర్ స్వామి వ్యాఖ్యల్లో వినిపించేది అహంకారం మరియు ఇతర సంప్రదాయాల పట్ల ద్వేషం.

ఆదివాసీల సహనాన్ని చేతకానితనంగా భావించవద్దు. ప్రకృతిని ప్రేమించే వారు, దానిని కాపాడుకోవడానికి ప్రాణాలైనా ఇస్తారు. వనదేవతలను కించపరిచిన ప్రతీ మాటకూ చినజీయర్ స్వామి సమాధానం చెప్పాల్సిందే. ప్రభుత్వం అహంకారపు పీఠాలకు కాకుండా, రాజ్యాంగానికి మరియు ప్రజల నమ్మకాలకు విలువ ఇవ్వాలి. లేనిపక్షంలో, మేడారం గడ్డపై నుంచి మొదలయ్యే నిరసన జ్వాలలు గద్దెలను సైతం కదిలిస్తాయి. అడవి తల్లి బిడ్డలైన ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత. అధికార గర్వంతో చేసే ఇలాంటి వ్యాఖ్యలను సమాజం ముక్తకంఠంతో ఖండించాలి.

అడవి బిడ్డల ఆత్మగౌరవం ఆకాశమంత. దానిని కాషాయం ముసుగులో కించపరచాలని చూస్తే చరిత్ర క్షమించదు. దేవుళ్లకు సర్టిఫికెట్లు ఇచ్చే అధికారం ప్రజలు ఎవరికీ ఇవ్వలేదు. చట్టం తన పని తాను చేయాలి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే రాజ్యాంగ బద్ధమైన 'సమత'కు నిజమైన గౌరవం లభిస్తుంది.

వెంక గారి భూమయ్య
సీనియర్
జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863



# ఆవిష్కరణలతో మానవ జీవనశైలిలో సమూల మార్పులు

### (16 ఫిబ్రవరి "ఆవిష్కరణ లేదా ఇన్నోవేషన్ దినోత్సవం" సందర్భంగా)



నేటి డిజిటల్ ఏఐ ప్రపంచం 'సృజనాత్మకత' లేదా 'క్రియేటివిటీ', 'ఆవిష్కరణ' లేదా 'ఇన్నోవేషన్' చుట్టు తిరుగుతుంది. నేటి శాస్త్ర సాంకేతిక ప్రగతి సృజన, ఆవిష్కరణల పునాదులపై కొనసాగుతున్నది. ఆవిష్కరణ లేదా ఇన్నోవేషన్ ప్రక్రియ వల్ల నూతన ఆలోచనలకు ఆచరణాత్మక రూపం ఇవ్వడం, కొత్త మెరుగైన ఉత్పత్తులు తయారు చేయడం, సేవల్లో మెరుగైన మార్పులు జరగడం, ప్రపంచాభివృద్ధికి ఊతం ఇవ్వడం అనాదిగా కొనసాగుతున్నది. ఆవిష్కరణ లేదా ఇన్నోవేషన్ ప్రాధాన్యాన్ని గుర్తించి అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట 16 ఫిబ్రవరి రోజు "ఆవిష్కరణ దినోత్సవం (ఇన్నోవేషన్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. సృజన, ఆవిష్కరణలతో మన జీవితాలు నిరంతరం ఊహించనంత వేగంగా మెరుగు పరచబడుతున్నాయి. నేటి ఆవిష్కరణ రేపు పాతదై పోతున్నది. 1800ల్లో ఇంగ్లాండ్‌లో పారిశ్రామిక విప్లవం ప్రారంభం అయ్యింది. 1876లో టెలిఫోన్ ఆవిష్కరణ, 1928లో పెన్సిలిన్, 1947లో ట్రాన్సిస్టర్, 1975లో మైక్రోసాఫ్ట్ స్థాపన, 2021లో ఎం–ఆర్ఎన్ఏ టీకాల తయారీ లాంటి సాంకేతిక ప్రగతి నమోదు అయ్యింది. ఆవిష్కరణలతో మెరుగైన ఉత్పాదకత, ఖర్చు తక్కువ, పోటీతత్వం పెరగడం, మెరుగైన బ్రాండింగ్ లేదా విలువ, నూతన భాగస్వామ్యాలు, టర్నోవర్ పెరగడం, లాభాల్లో వృద్ధి లాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయని తెలుసుకోవాలి.

**సృజనశీలత, ఆవిష్కరణల మధ్య వ్యత్యాసం:**

కొత్త ఆలోచనలు, పద్ధతులు, ఉత్పత్తులు లేదా సేవలను ప్రవేశపెట్టడం ఫలితంగా అప్పటికే ఆచరణలో ఉన్న విధానాలను మెరుగు పరడం లేదా సమస్యలకు సరి కొత్త పరిష్కారాలను కనుగొనడాన్ని 'ఇన్నోవేషన్ (ఆవిష్కరణ)' అని అంటున్నాం. నేడు వాడకంలో ఉన్న పరికరం కన్న భిన్నంగా లేదా కొత్తగా తయారు చేయడం, వాణిజ్యపరంగా లాభసాటిగా ఉండడం, సామాజిక ఉపయోగాలను కలిగి ఉండడం, నిజ జీవితంలో అమలులో ఉండడం, పాత పద్ధతులను అప్‌డేట్ చేయడం లాంటి సుగుణాలు ఇన్నోవేషన్ సొంతం. 'సృజనాత్మకత (క్రియేటివిటీ)'తో 'ఆవిష్కరణ (ఇన్నోవేషన్)'కు దగ్గరి సంబంధం ఉన్నప్పటికీ ఆ రెండు వేరు వేరు అంశాల్ని తెలుసు కోవాలి. కొత్త ఆలోచనలను రూపొందించే మానసిక సామర్థ్యాన్ని సృజనాత్మకతగా అర్థం చేసుకోవాలి. సృజనాత్మక ఆలోచనలను ఆచరణలో పెట్టి, వాస్తవ రూపంలోకి మార్చి, విలువను పెంచే చర్యను ఆవిష్కరణ అని అంటాం. సృజనాత్మకత నూతన ఆలోచనలను పుట్టిస్తే, ఆవిష్కరణ ఆ ఆలోచనలకు రూపం ఇస్తుంది. సృజన మానసిక ప్రక్రియ. ఇన్నోవేషన్ ఆచరణాత్మక తో కూడిన ప్రక్రియ. ఊహ చుట్టు సృజన తిరిగితే, అమలు చుట్టు ఆవిష్కరణ భ్రమిస్తుంది. సృజన కొత్తదనాన్ని కోరితే, ఆవిష్కరణ ప్రయోజనాన్ని కోరుకుంటుంది.

ఇన్నోవేషన్ వల్ల ప్రగతి వేగం పుంజుకుంటున్నది. ఇన్నోవేషన్ డే వేదికగా సృజనశీలత ప్రాధాన్యం వ్యాపింపజేయాలి. కొత్త ఆలోచనలను అమలు చేయడంతో సాంకేతిక ప్రగతి, ఔషధాల తయారీ, వ్యాపార ధోరిణి, మానవ జీవనశైలిల్లో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. సృజన, ఆవిష్కరణలతో ఆవిష్కర్తలు, ఔత్సాహికులు, ఆలోచనాపరులు ఒకే వేదికపై చేరి అనంత అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ఇన్నోవేషన్ ద్వారా స్టార్టప్‌లు వెలుస్తున్నాయి. అంకుర సంస్థలకు సృజన, ఆవిష్కరణలే ఉచ్ఛ్వాసనిశ్వాసలుగా నిలుస్తున్నాయి. సృజన, ఆవిష్కరణల పుణ్యంతో రోజు రోజు 'అప్‌డేట్' కానపుడు 'అవుట్‌డేట్' అయ్యే ప్రమాదాలను గమనిస్తున్నాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కౌన్సిల్ సంఖ్యాబలం... నాయకత్వ పోరాటం

### మున్సిపల్ ఫలితాల తర్వాత రాజకీయ గణితం... పట్టణ ప్రజాస్వామ్యంలో కీలక ఘట్టం

**తెలంగాణ పట్టణ రాజకీయాల్లో మరో కీలక మలుపుకు నేడు తెరలేపుతోంది. వార్డు సభ్యుల ఎన్నికలతో వ్యక్తమైన ప్రజా తీర్పు ఇప్పుడు మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల రూపంలో అధికార నిర్మాణంగా మారబోతోంది. పట్టణ స్థానిక సంస్థలు కేవలం పరిపాలనా యంత్రాంగాలే కావు; ప్రజల దైనందిన జీవన ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, పౌర సేవల నాణ్యత — ఇవన్నీ ఇక్కడే నిర్ణయమవుతాయి. అందుకే ఈ ఎన్నికలు స్థానిక రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర రాజకీయ దిశను సూచించే సూచికలుగా భావించబడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అత్యంత దగ్గర స్థాయిలో జరిగే ఈ ప్రక్రియలో ప్రజల అభిప్రాయం, పార్టీల వ్యూహాలు, స్థానిక సామాజిక సమీకరణాలు కలిసి ఒక సమగ్ర రాజకీయ దృశ్యాన్ని సృష్టిస్తున్నాయి.**



ఈ ఎన్నికల నిర్వహణ మొత్తం రాజ్యాంగబద్ధ వ్యవస్థలో భాగంగా జరుగుతోంది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను పర్యవేక్షిస్తూ నియమ నిబంధనలను అమలు చేస్తున్నది తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం. ఎన్నికల షెడ్యూల్ నుంచి ఫలితాల ధృవీకరణ వరకు ప్రతి దశలో పారదర్శకత, చట్టబద్ధతను కాపాడే బాధ్యత ఈ సంస్థపై ఉంది. వార్డు సభ్యుల ఎన్నికల అనంతరం కౌన్సిల్ ఏర్పడుతుంది. ఆ కౌన్సిల్‌లోని ఎన్నికైన సభ్యులే మేయర్ లేదా చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఈ విధానం ప్రత్యక్ష ప్రజా తీర్పు మరియు ప్రతినిధి ప్రజాస్వామ్యం మధ్య సమతుల్యతను సూచిస్తుంది. కొన్ని చోట్ల ఎక్స్–ఆఫిషియో సభ్యుల పాత్ర, చట్టపరమైన వివరణలు, పార్టీ విప్‌లు వంటి అంశాలు ఎన్నికల ఉత్కంఠను పెంచుతాయి.

ప్రస్తుతం నిర్వహించిన పట్టణ ఎన్నికలు రాష్ట్ర వ్యాప్తంగా అనేక మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను కవర్ చేశాయి. వేల సంఖ్యలో వార్డుల్లో జరిగిన పోటీ పట్టణ ఓటర్ల చైతన్యాన్ని ప్రతిబింబించింది. నీటి సరఫరా, పారిశుధ్యం, ట్రాఫిక్, రహదారులు, పట్టణ ప్రణాళిక, పన్నుల నిర్వహణ వంటి సమస్యలు ఎన్నికల ప్రధాన అజెండాగా నిలిచాయి. స్థానిక సమస్యలపై స్పష్టమైన హామీలు ఇచ్చిన అభ్యర్థులకు ప్రజలు ప్రాధాన్యం ఇచ్చినట్లు ఫలితాల ధోరణి సూచిస్తోంది. పట్టణ ఓటరు ఇప్పుడు అభివృద్ధి, సేవల నాణ్యత, పరిపాలనా సమర్థత ఆధారంగా నిర్ణయం తీసుకుంటున్నాడనే అభిప్రాయం బలపడుతోంది.

ఫలితాల పరంగా చూస్తే పట్టణ రాజకీయాల్లో స్పష్టమైన పోటీ కనిపించింది. అధికారంలో ఉన్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అనేక పట్టణాల్లో ముందంజలో నిలవడం ద్వారా కౌన్సిళ్లలో ఆధిక్యాన్ని సంపాదించింది. రాష్ట్ర నాయకత్వం, ముఖ్యంగా రేవంత్ రెడ్డి ముందుంచిన అభివృద్ధి, సంక్షేమ దృక్కోణం పట్టణ ఓటర్లపై ప్రభావం చూపిందనే విశ్లేషణ వినిపిస్తోంది. కౌన్సిల్‌లో స్పష్టమైన సంఖ్యాబలం ఉన్న చోట మేయర్, చైర్మన్ ఎన్నికలు సులభతరంగా జరిగే అవకాశం ఉంది. అయితే పట్టణ రాజకీయాల్లో స్థానిక నాయకత్వం, వ్యక్తిగత ప్రభావం కూడా కీలక పాత్ర పోషిస్తాయి.

ప్రధాన ప్రతిపక్షంగా నిలుస్తున్న భారత్ రాష్ట్ర సమితి అనేక పట్టణాల్లో గట్టి పోటీ ఇచ్చింది. గత పాలనలో చేపట్టిన పట్టణ మౌలిక వసతుల అభివృద్ధిని ప్రధానంగా ప్రస్తావిస్తూ ఈ పార్టీ తన బలం నిలబెట్టుకునే ప్రయత్నం చేసింది. కొన్ని కౌన్సిళ్లలో స్పష్టమైన మెజారిటీ దక్కకపోయినా, కీలక స్థానాల్లో ప్రభావం చూపే స్థాయిలో సభ్యత్వాన్ని సాధించింది. హంగ్ పరిస్థితుల్లో ఈ పార్టీ పాత్ర మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. స్వతంత్ర సభ్యుల మద్దతు, వ్యూహాత్మక చర్చలు, రాజకీయ సమన్వయం — ఇవన్నీ నాయకత్వ ఎన్నికల్లో నిర్ణయాత్మకంగా మారవచ్చు.

పట్టణ స్థాయిలో విస్తరణ లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ కూడా గణనీయ ప్రదర్శన కనబరిచింది. మధ్యతరగతి పట్టణ ఓటర్లను ఆకర్షించే అభివృద్ధి వాదన, స్థానిక సమస్యలపై దృష్టి ఈ పార్టీకి కొన్నిచోట్ల కీలక స్థానాలను తెచ్చిపెట్టాయి. ఇదే సమయంలో నగర ప్రాంతాల్లో ప్రభావం కలిగిన ఆల్ ఇండియా మజ్లిస్–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ తన సామాజిక ఆధారాన్ని నిలబెట్టుకుంటూ కొన్ని కౌన్సిళ్లలో ప్రభావాన్ని కొనసాగిస్తోంది. ఈ వైవిధ్యం పట్టణ రాజకీయాల బహుముఖ స్వరూపాన్ని ప్రతిబింబిస్తుంది.

ఈ ఎన్నికలలో ముఖ్యంగా గమనించాల్సిన అంశం హంగ్ కౌన్సిళ్ల పెరుగుదల. అనేక పట్టణాల్లో ఏ ఒక్క పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో స్వతంత్రులు, చిన్న పార్టీలు కీలక పాత్రలోకి వచ్చాయి. ఇలాంటి సందర్భాల్లో రాజకీయ చర్చలు, కూటములు, వ్యూహాత్మక మద్దతులు ప్రధానమవుతాయి. సభ్యుల నిర్ణయాలు, పార్టీ విప్‌లు, చట్టపరమైన పరిమితులు — ఇవన్నీ కలిసి నాయకత్వ ఎన్నికల దిశను నిర్ణయిస్తాయి. ప్రజాస్వామ్యంలో చర్చా సంస్కృతి, రాజీ రాజకీయాలు ఇక్కడ స్పష్టంగా కనిపిస్తాయి.

మేయర్ లేదా చైర్మన్ పదవి పట్టణ పాలనలో కేంద్ర స్థానం. పట్టణ బడ్జెట్ వినియోగం, అభివృద్ధి ప్రాధాన్యాల నిర్ణయం, పౌర సేవల సమన్వయం, పరిపాలనా పర్యవేక్షణ — ఇవన్నీ నాయకత్వంపై ఆధారపడి ఉంటాయి. కౌన్సిల్‌తో సమన్వయం సాధించడం, అధికార యంత్రాంగంతో సమర్థంగా పని చేయడం, ప్రజా సమస్యలకు వేగంగా స్పందించడం — ఇవి విజయవంతమైన పట్టణ పాలనకు అవసరమైన లక్షణాలు. అందువల్ల ఈ ఎన్నికలు కేవలం రాజకీయ విజయాల కొలమానం కాకుండా పట్టణ ప్రజల జీవన నాణ్యతను ప్రభావితం చేసే నిర్ణాయక దశ.

పూర్వ ఎన్నికలతో పోలిస్తే పట్టణ ఓటర్ల ప్రాధాన్యతల్లో మార్పు కనిపిస్తోంది. వ్యక్తిగత సేవా చరిత్ర, స్థానిక సమస్యలపై అవగాహన, అభివృద్ధి దృక్కోణం — ఇవి అభ్యర్థుల ఎంపికలో కీలక ప్రమాణాలుగా మారాయి. పార్టీ గుర్తింపు ఉన్నప్పటికీ, స్థానిక నాయకత్వం ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఇది పట్టణ ప్రజాస్వామ్యంలో పరిపక్వతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

పార్టీల వ్యూహాల పరంగా చూస్తే స్పష్టమైన సంఖ్యాబలం ఉన్న చోట నాయకత్వ ఎన్నికలు సులభంగా జరిగే అవకాశం ఉంది. హంగ్ పరిస్థితుల్లో మాత్రం చర్చలు, మద్దతు సమీకరణాలు కీలకం. ప్రతి పార్టీ తనకు అనుకూలమైన కూటమి నిర్మాణానికి ప్రయత్నిస్తోంది. స్వతంత్ర సభ్యుల ప్రాధాన్యం పెరగడంతో రాజకీయ చాతుర్యం పరీక్షకు లోనవుతోంది. ఈ ప్రక్రియ మొత్తం పట్టణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చు.

మొత్తం మీద ఈ పట్టణ ఎన్నికలు తెలంగాణ రాజకీయ దిశను ప్రతిబింబిస్తున్నాయి. ప్రజా తీర్పు ఆధారంగా ఏర్పడే కౌన్సిళ్లు, వాటి నుంచి ఎన్నికయ్యే నాయకత్వం పట్టణాభివృద్ధికి కొత్త దిశను నిర్దేశించే సామర్థ్యం కలిగి ఉంది. పారదర్శక పరిపాలన, సమర్థ సేవల అమలు, ప్రజల భాగస్వామ్యం — ఇవే విజయవంతమైన పట్టణ పాలనకు మూల స్తంభాలు. నేడు జరుగుతున్న మేయర్, చైర్మన్ ఎన్నికలు ఆ దిశగా కీలక అడుగు. పట్టణ ప్రజాస్వామ్యం బలపడితేనే రాష్ట్ర అభివృద్ధి స్థిరంగా ముందుకు సాగుతుంది. తెలంగాణ పట్టణ రాజకీయాల్లో ఈ ఎన్నికలు ఒక కీలక మైలురాయిగా నిలిచి, భవిష్యత్ పాలనా రూపురేఖలను నిర్దేశించనున్నాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494

# ప్రకృతి ద్వారా పరమాత్మ సందేశాలు



**భూమి:**

గుండెలో గుచ్చినను భరించి ప్రతిఫలంగా పంటలను, పుష్ప ఫల వృక్షాలను, ప్రసాదిస్తూ, అలానే, మలమూత్రాలను విసర్జించినను, త్రొక్కివేస్తున్నను, ఎంతో నష్టం కష్టం కల్గిస్తున్నను క్షమత్వంతో సహనంగా ఉండడం ద్వారా – క్షమత్వమును, ఓర్పునూ, భూతదయను కల్గివుండాలన్న సందేశం "భూమి"ది.

**ఆకాశం:-**

వచ్చి పోయే మేఘాల వలన మలినపడకుండా, సూర్యచంద్రులు, నక్షత్రాలు, వాయువు తనతో ఉన్నా, వాటితో ఎలాంటి సంగత్వం ఏర్పరుచుకోకుండా, నిర్మలంగా ఉండడం ద్వారా – మానవుడు కూడా వచ్చే పోయే ఆలోచనలతో అంతఃకరణమును మలినపరుచుకోకుండా స్వచ్ఛంగా ఉండాలని, ఎన్ని బంధాల మధ్య ఉన్నా వాటితో సంగత్వం కలియుండక నిర్మలంగా వుండాలన్న సందేశం "ఆకాశము"ది.

**సూర్యుడు:-**

ఒక చిన్న మడుగైనా, పిల్ల కాలువైనా, నదైనా, మహాసముద్రమైనా అన్నింటిలో ఒకేలా ప్రతిబింబిస్తూ, అలానే, నీళ్ళ కుండలలో ప్రతిబింబించి అనేక సూర్యులుగా కన్పించడం ద్వారా – మానవుడు సమత్వదృష్టి కల్గియుండాలని, అలానే పరమాత్మ ఒక్కడే అయినా అనేక శరీరములయందు ఆత్మగా గోచరిస్తాడన్న జ్ఞాన సందేశము "సూర్యుడు"ది.

**చంద్రుడు:-**

వెలుగు చీకటిలతో వృద్ధిక్షయాలను పొందడం ద్వారా – జీవితంలో సుఖదుఃఖాలు సహజమనే సందేశం "చంద్రుని"ది.★

**నీరు:**

ఎటువంటి మలినాలైనను వాటిని శుద్ధిచేసి తాజాదనమును, నిగారింపును తీసుకురావడం ద్వారా – మానవుడు కూడా మనో మాలిన్యాలను తొలగించుకొని శుద్ధత్వము కల్గియుండాలన్న సందేశం "నీటి"ది.

**అగ్ని:**

స్థూల మాలిన్యాలని హరింపజేసి, ప్రకాశిస్తూ, కారణ రూపాన్ని విడిచిపెట్టడం ద్వారా – మానవుడు కూడా కర్మపాశాలను హరింపజేసుకొని భక్తిజ్ఞానంలతో ప్రకాశించాలన్న సందేశం "అగ్ని"ది.

**గాలి:**

అన్నిచోట్ల తిరిగినను, అన్నింటిని స్పృశించినను అన్నింటిని ఎక్కడికక్కడే విడిచిపెట్టేస్తూ, అంతటా ఉన్ననూ ఏదీ అంటించుకోకుండా స్వచ్ఛంగా ఉంటూ, అలానే తను ఉన్నచోట వాతావరణమును చల్లగా, ఉల్లాసంగా ఆహ్లాదంగా మార్చుతూ, అందరిలో జీవాన్ని నింపడం ద్వారా – మానవుడు కూడా అహంకార రహితంగా ఏదీ అంటించుకోకుండా తామరాకుపై నీటిబొట్టులా నిస్సంగుడై జీవించాలని, అలానే ఉన్నచోట అందరిని ఆనందంగా వుంచుతూ, ఉల్లాసంగా జీవించాలనే సందేశం "గాలి"ది.

**నది**

తాను ఎక్కడ యున్నదో పట్టించుకోక పర్వతమైన, లోయైనా, వంకలైనా, డొంకలైనా, రాళ్ళురప్పల సందులైనా ఏమాత్రం తేడా లేకుండా ప్రవహిస్తూ, తనకి మూలమైన సముద్రాన్ని చేరేంతవరకు ప్రయాణిస్తూనే వుంటూ, పత్రపుష్పాదులు, చెక్కముక్కలు, చెత్తా చెదారములు, చిరు చిరు ప్రాణులు ప్రవాహంలో తనతో పాటు తీసుకువెళ్తూ, తనలో పాలుపోసినా, చెత్తను పడేసిన సముద్రంలో కలిసేంతవరకు ప్రవహించడమనే తన సహజలక్షణమును వదలకపోవడం ద్వారా – మానవ జీవితం కూడా పరవళ్ళుతో ప్రవహించే తనలాంటిదేనని, ఎన్ని అడ్డులు ఉన్నా వాటిని పట్టించుకోక గమ్యం చేరేంతవరకు గమనమును సాగించాలన్న సందేశం "నది"ది.

**సముద్రం:**

అలుపు లేకుండా తీరాన్ని తాకాలని ప్రయత్నించే అలలు ద్వారా, మరియు ఎన్ని నదులు తనలో ప్రవేశించుచున్ననూ పొంగిపొర్లిపోకుండా, అలానే నదులు తనలో చేరక ఎండిపోయినను తాను వట్టిపోకుండ ఉండడం ద్వారా – ఎన్ని సంపదలు తనని చేరుతున్న పొంగిపోక, అలానే ఏ సంపదలు చేరకపోయినా కృంగిపోకుండా హెచ్చుతగ్గుల స్థితి యందు స్థితప్రజ్ఞతో గంభీరుడై, అనుకున్నది సాధించాలనే పట్టుదలతో మానవుడు ఉండాలన్నది "సముద్ర" సందేశం.

**పక్షులు:**

కిలకిలారావాలతో ప్రతిక్షణం ఆనందంగా హాయిగా స్వేచ్ఛగా పరిపూర్ణంగా జీవించడం ద్వారా మానవుడు కూడా ప్రకృతి లోనే ఉంటూ, ఆనందంగా పరిపూర్ణంగా జీవించాలన్న సందేశం "పక్షుల"ది.

**చెట్టు:**

తన చెంతకు ఎవరొచ్చినా తరతమ భేదం లేకుండా, హెచ్చుతగ్గుల భేదం లేకుండా వచ్చింది పశుపక్షాదులా, మానవులా అన్న తారతమ్యం లేకుండా నీడను, పండ్లను ఇవ్వడం ద్వారా మానవుడు నిస్వార్ధ సేవాపరుడై ఎలా ఉండాలన్న సందేశం "చెట్టు"ది.

మొక్కపై అలరారుతూ అందంగా వికసించి, తన దగ్గరకు వచ్చిన వాళ్ళందరికీ పరిమళాన్ని ఇచ్చి ఆనందమును కల్గిస్తూ, వాడిపోయక హాయిగా రాలిపోతూ సరళంగా ఉండడం ద్వారా – మానవుడు కూడా అంత ఆదర్శంగానే సరళంగా జ్ఞానవంతంగా జీవించాలన్న సందేశాన్నిస్తుంది "పువ్వు".

కానీ, మానవుడు వీటిని ఎంతవరకు గుర్తిస్తున్నాడు? అన్నీ కాకపోయినా ఇందులో ఒకటైనా జీవితాంతం ఆచరిస్తే చాలని పెద్దల వాక్కు.ప్రకృతి ద్వారా పరమాత్మ సందేశాలు

కామిడి సతీష్ రెడ్డి
భూపాల్ పల్లి జిల్లా 9848445134

# ఈ జ్యూస్ తాగితే జుట్టు నల్లగా, ఒత్తుగా..



**కావాల్సిన పదార్థాలు:** యాపిల్ ఒకటి, బీట్ రూట్ చిన్నది ఒకటి, ఒక చిన్న అల్లం ముక్క, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, 4 టేబుల్ స్పూన్స్ పటిక బెల్లం, అర టీ స్పూన్ మిరియాల పొడి, 2 క్యారెట్లు, 2 ఉసిరికాయలు తీసుకోవాలి.

బీట్ రూట్, యాపిల్ జ్యూస్ చేయడానికి యాపిల్ ను శుభ్ర పరచి దానిని ముక్కలుగా కట్ చేసుకోవాలి. అలాగే, బీట్ రూట్‌ను తీసుకుని ముక్కలుగా చేసి పక్కన పెట్టుకోవాలి. ఇంకా అదే రీతిలో క్యారెట్‌ను కూడా తీసుకుని అలాగే ముక్కలు చేసుకుని చేయాలి.

ఇక ఇప్పుడు ఉసిరికాయలను తీసుకుని శుభ్రపరచుకుని గింజలు తీసేసి ముక్కలుగా చేసుకుని పెట్టాలి. అలాగే అదే చేతితో అల్లాన్ని కూడా తీసుకుని ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. ఇక ఇప్పుడు వీటిని తీసుకొని బాగా గ్రైండ్ చేసుకోవాలి. మధ్యలో ఒకసారి నీళ్ళు పోసుకుని బాగా తిప్పుకోవాలి. పటిక బెల్లం, మిరియాల పొడి, నిమ్మరసం,వేసి మెత్తగా పట్టుకోవాలి. అంతా పేస్ట్ అయ్యాక ఇక ఇప్పుడు రెండు గ్లాసుల నీళ్లు పోసి స్పూన్ తో బాగా మిక్స్ చేసుకోవాలి. అంతే, బీట్ రూట్ యాపిల్ జ్యూస్ రెడీ. దీనిని తాగితే అమ్మాయిలకు జుట్టు రాలడం తగ్గి పెరుగుతుంది. అంతేకాదు, ఇది ఆరోగ్యానికి చాలా మంచిది

## విటమిన్ డి తీసుకునే ముందు
# ఈ తప్పులు అస్సలు చేయకండి?



**ఖాళీ కడుపుతో అస్సలు తీసుకోకండి :** విటమిన్ డి వేసుకోగానే వెంటనే కరిగిపోతుంది. కాబట్టి, పరగడుపున దీనిని తీసుకుంటే ఎన్నో సమస్యలు వస్తాయి. ఇది వేసుకోవడం వలన సప్లిమెంట్లు తీసుకున్నప్పటికీ కడుపులో ఇబ్బంది కలుగుతుంది.

కాబట్టి, ఇలా అస్సలు వేసుకోకండి.

**సరైన సమయం:** భోజనం తిన్న తర్వాత దీనిని తీసుకోవద్దని నిపుణులు కూడా చెబుతున్నారు. వీలైనంత వరకు మీరు తినే ఆహారంతో పాటు తీసుకుంటే చాలా మంచిదని చెబుతున్నారు.

**అధిక మోతాదు:** మీ సొంతగా ఎక్కువగా దీనిని తీసుకోకండి. అంతేకాదు, 4,000 ×ఖ కంటే ఎక్కువ తీసుకోవాలనుకుంటే వైద్యుడిని సంప్రదించి తీసుకోవాలి లేదంటే ప్రమాదానికి దారితీస్తుంది.

**ఐరన్ :** ఐరన్ సప్లిమెంట్లను గ్యాప్ ఇచ్చి తీసుకోవాలి. ఎందుకంటే, ఇవి ఇవి విటమిన్ ఐ3 తో కంటే కొంచం పవర్ఫుల్ గా ఉంటాయి

**అధిక ఫైబర్ :** మీరు ఎక్కువగా భోజనం చేసిన రోజు దీనిని తీసుకోకపోవడమే మంచిది. ఎందుకంటే ఫైబర్ ఒక్కోసారి దీని ప్రభావాన్ని అడ్డుకుంటుంది. అప్పుడు, విటమిన్ డి వేసుకున్నా కూడా ప్రయోజనం ఉండదు

## అదిరిపోయే గుడ్‌న్యూస్..
# రూ.90 వేలకు తగ్గనున్న బంగారం ధర! ఆర్థిక నిపుణుల కొత్త అంచనా..!

గత శుక్రవారం బంగారం రేటు 10 గ్రాములకు రూ. 1,56,200 వద్ద ముగిసింది. ఇది దాని మునుపటి గరిష్ట స్థాయి కంటే దాదాపు రూ. 24,500 లేదా 13.50 శాతం తక్కువ. అంతర్జాతీయ మార్కెట్లో జూవీజుశ బంగారం రేటు ఔన్స్‌కు 5,046.30 డాలర్ల వద్ద ముగిసింది. ఇది రికార్డు గరిష్ట స్థాయి 5,626.80 డాలర్ల కంటే దాదాపు 10.50 శాతం తక్కువ.



**మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం..**

రష్యా అమెరికాతో డాలర్లలో వ్యాపారం చేయడానికి తిరిగి ప్రయత్నిస్తున్నట్లు వస్తున్న నివేదికల మధ్య బంగారం ధరల ర్యాలీకి బ్రేకులు పడేలా ఉన్నాయి. వార్తా సంస్థ బ్లూమ్‌బెర్గ్ ఉదహరించిన రష్యన్ అంతర్జాతీయ పత్రం క్రెమ్లిన్ అమెరికాతో ఆర్థిక భాగస్వామ్యాన్ని అన్వేషిస్తోందని సూచిస్తుందని వారు చెప్పారు. ఈ పరిణామంలో అత్యంత ఆసక్తికరమైన భాగం రష్యా, యుఎస్ డాలర్ ఆధారిత వాణిజ్య ఒప్పందానికి తిరిగి రావడం, ఇది రష్యాతో సహా బ్రిక్స్ దేశాల డీ-డాలరైజేషన్ ప్రయత్నాలకు పెద్ద దెబ్బ అవుతుంది. బ్రిక్స్ సభ్యులు తమ వాణిజ్య పరిష్కారాలలో యుఎస్ డాలర్ స్థానంలో బంగారాన్ని కూడబెట్టుకుంటున్నారని, కానీ రష్యా యుఎస్ డాలర్‌కు తిరిగి రావడం డీ-డాలరైజేషన్, బంగారం ధరల ర్యాలీపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు తెలిపారు. ఈ వార్తల నివేదికలపై రష్యా ఇంకా స్పందించాల్సి ఉంది.

**బంగారం ధరలు తగ్గుతాయా?**

బంగారం ధరల డిమాండ్-సరఫరా డైనమిక్స్‌లో నిర్మాణాత్మక మార్పును అంచనా వేస్తూ.. ూాజజు 360కి చెందిన అమిత్ గోయెల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు ఇప్పటికే ఔన్స్‌కు 5,626.80 డాలర్ల వద్ద, భారత్‌లో 10 గ్రాములకు రూ. 1,80,779 వద్ద గరిష్ట స్థాయికి చేరుకున్నాయని అన్నారు. బంగారం తన నష్టాలను తొలగించడానికి చేసిన ప్రతి ప్రయత్నం తర్వాత గోల్డ్ డెడ్-క్యాట్ బౌన్స్ కనిపించింది. డీ-డాలరైజేషన్ ప్రక్రియలో ఇటువంటి నిర్మాణాత్మక మార్పు ప్రపంచ కేంద్ర బ్యాంకుల భయాందోళనలకు దారితీస్తుందని, బంగారానికి అనుకూలంగా డిమాండ్-సరఫరా అసమతుల్యతను తగ్గించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

మొదటి ట్రిగ్గర్ పేపర్ బంగారం అమ్మకంలో వచ్చినప్పటికీ, అది చివరకు భౌతిక బంగారం ధరలను తాకుతుంది. భారత్‌లో బంగారం ధరలు ఇప్పటికే దాదాపు 15 శాతం తగ్గాయి, ఈ పరిణామం తర్వాత ఈ తగ్గుదల మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. భారత్‌లో బంగారం ధరలు 10 గ్రాములకు రూ. 1 లక్ష కంటే తక్కువగా రావొచ్చే, జూవీజుశ బంగారం ధరలు 2027 చివరి నాటికి ఔన్సుకు 3,000 డాలర్లకు చేరుకోవచ్చు అని అమిత్ గోయెల్ అంచనా వేస్తున్నారు. భారత్‌లో బంగారం రేటు 2027 చివరి నాటికి 10 గ్రాములకు రూ. 90,000 నుండి రూ. 1,00,000 వరకు తగ్గవచ్చని ఆయన అన్నారు.

# తలరాతనే మార్చేసింది..
## 1 లక్ష రూపాయలు రూ.14 కోట్లుగా మారింది..!




Stock Market



**కొన్నిసార్లు స్టాక్ మార్కెట్లో కేవలం పెట్టుబడికి మాత్రమే కాకుండా, ఓర్పు, విశ్వాసానికి ప్రతిఫలంగా నిరూపించే స్టాక్‌లు ఉంటాయి. నర్ఛూర్ వెల్ ఇండస్ట్రీస్ అలాంటి ఒక ఉదాహరణ.**

కేవలం 3 పైసలతో ప్రారంభమైన ఈ స్టాక్ 6 సంవత్సరాలలో రూ. 1 లక్ష పెట్టుబడిని దాదాపు రూ. 14 కోట్లుగా మార్చింది. ఈ స్టాక్ 1,40,000% కంటే ఎక్కువ రాబడిని ఇవ్వడం ద్వారా పెట్టుబడిదారులను ఆశ్చర్యపరిచింది.

స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టడం అనేది తరచుగా లోతైన సముద్రంలో ముత్యాల కోసం వెతుకుతున్నట్లే. ఎల్లప్పుడూ ప్రమాదం ఉంటుంది. కానీ సరైన సమయం, సరైన ఆప్షన్లు, ఓపిక కలిసి వచ్చినప్పుడు ఫలితాలు అద్భుతమైనవిగా ఉంటాయి. ఇటీవల నర్ఛూర్ వెల్ ఇండస్ట్రీస్ అటువంటి స్ఫూర్తిదాయకమైనవి. ఇది దాని దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు అసాధారణ రాబడిని ఇచ్చింది.

**ఇది కూడా :**
**ఒక్కసారి ఇన్వెస్ట్ చేస్తే చాలు.. నెలకు రూ. 20 వేలు వచ్చే స్కీమ్ గురించి**

**మీకు తెలుసా?**

గత ఆరు సంవత్సరాలలో కంపెనీ షేర్ల పనితీరు అద్భుతంగా ఉంది. ఆరు సంవత్సరాల క్రితం ఈ షేరు కేవలం 3 పైసలు (రూ. 0.03) వద్ద ట్రేడవుతోంది. ఆ సమయంలో ఈ పెన్నీ స్టాక్ భవిష్యత్తును మార్చేస్తుందని ఎవ్వరు కూడా ఊహించి ఉండరు. నేడు ఈ షేరు దాదాపు రూ. 42.30 స్థాయికి చేరుకుంది. ఈ సమయంలో ఇది దాదాపు 1,40,566% పెరిగింది.

జనవరి 2024-ఆగస్టు 2025 మధ్య స్టాక్ బలమైన ర్యాలీని చూసింది. ఆ తర్వాత లాభాల బుకింగ్ కారణంగా దాదాపు 57% పడిపోయింది. కానీ సెప్టెంబర్ 2025 తర్వాత స్టాక్ తిరిగి ఊపందుకుంది. అలాగే పెట్టుబడిదారుల ఆశలను పునరుద్ధరించింది.

**రూ. 1 లక్ష పెట్టుబడితో జీవితాన్ని మార్చే లాభాలు:**

ఆరు సంవత్సరాల క్రితం ఒక పెట్టుబడిదారుడు ఈ కంపెనీలో రూ. 1 లక్ష పెట్టుబడి పెట్టి, మార్కెట్ హెచ్చు తగ్గుల సమయంలో ఓపికగా ఉండి ఉంటే దాని విలువ నేడు దాదాపు రూ. 14.10 కోట్లకు చేరుకుంది. ఇంత భారీ లాభం ఏ మధ్యతరగతి కుటుంబానికైనా జీవితాన్ని మార్చేది కావచ్చు.

వాటాదారులకు ప్రయోజనం చేకూర్చే దిశగా కంపెనీ ముఖ్యమైన చర్యలు కూడా తీసుకుంది. ఇది ఏప్రిల్ 2024లో 1:1 బోనస్ షేరును అక్టోబర్ 2024లో 1:10 షేరు విభజనను ప్రకటించింది. ఈ కార్పొరేట్ చర్యలు ప్రారంభ పెట్టుబడిదారుల సంపదను మరింత పెంచాయి.

**కంపెనీ ఆర్థిక గణాంకాలు ఏమి చెబుతున్నాయి?**

ఏదైనా స్టాక్ ఆర్థిక ఆరోగ్యం దాని దీర్ఘకాలిక విజయంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. గతంలో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌గా పిలువబడే నర్ఛూర్ వెల్ ఇండస్ట్రీస్, దాని వ్యాపార నమూనాలో పెద్ద పరివర్తనకు గురైంది. ఇప్పుడు ఆహార రంగంలో బలమైన స్థానాన్ని ఏర్పరచుకుంది.

డిసెంబర్ త్రైమాసికం (Q3FY26) ఫలితాల ప్రకారం, కంపెనీ లాభం గత సంవత్సరంతో పోలిస్తే 95% పెరిగి రూ. 34.60 కోట్లకు చేరుకోగా, ఆదాయం 46% పెరిగి రూ. 290 కోట్లకు చేరుకుంది. మార్జిన్లు కూడా మెరుగుపడ్డాయి. ఆర్గానిక్, ప్రాసెస్డ్ ఫుడ్స్, బేకరీ విభాగాలలో కంపెనీ వేగంగా విస్తరిస్తోంది.

దాదాపు రూ. 1,000 కోట్ల మార్కెట్ క్యాప్‌తో బలమైన వ్యూహం, ఓపికగల పెట్టుబడితో చిన్న కంపెనీ కూడా అద్భుతమైన వృద్ధిని సాధించగలదని నర్ఛూర్ వెల్ ఇండస్ట్రీస్ నిరూపించింది.

## 15 నిమిషాల సైక్లింగ్‌తో
# అద్భుత ఫలితాలు..
## ఆరోగ్యానికి బంగారు నిధి! డాక్టర్లు చెప్పే నిజాలు తెలిస్తే..

**పొట్ట దగ్గర కొవ్వు తగ్గుతుంది: మీరు పెరుగుతున్న బొడ్డు కొవ్వు గురించి ఆందోళన చెందుతూ, భద్రతా కారణాల దృష్ట్యా జిమ్‌కు వెళ్లకుండా ఉంటే, సైక్లింగ్ చాలా తక్కువ సమయంలోనే మీ బొడ్డు కొవ్వును తగ్గించడంలో మీకు సహాయపడుతుంది. ఇంకా, రోజువారీ సైక్లింగ్ శరీరంలోని అన్ని భాగాలలో కొవ్వును తగ్గిస్తుంది. కండరాలను టోన్ చేస్తుంది.**



**గుండె జబ్బులు తగ్గుతాయి:** సైక్లింగ్ అనేది గుండె జబ్బులను నివారించడానికి సహాయపడే ఒక రకమైన కార్డియో వ్యాయామం. సైక్లింగ్ వల్ల గుండె జబ్బుల ప్రమాదం దాదాపు 46 శాతం తగ్గుతుందని పరిశోధనలో తేలింది. కాబట్టి, మీ గుండెను జాగ్రత్తగా చూసుకోవడానికి, ప్రతిరోజూ 15-20 నిమిషాలు సైకిల్ తొక్కడం మర్చిపోవద్దు.

**క్యాన్సర్ ప్రమాదం తక్కువ:** బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో, సైకిల్ తొక్కడం వల్ల పనికి నడక కంటే ఎక్కువ





ప్రయోజనకరంగా ఉంటుందని పరిశోధకులు కనుగొన్నారు. సైక్లింగ్ మీ కాళ్ళు, చేతులు మరియు ఉదరం కండరాలను ఏకకాలంలో పనిచేసేలా చేస్తుంది. అంటే మీరు వాటన్నింటినీ ఒకేసారి వ్యాయామం చేస్తున్నారు. రోజువారీ సైక్లింగ్ మీ క్యాన్సర్ ప్రమాదాన్ని 45 శాతం వరకు తగ్గిస్తుంది.

**కేలరీలు వేగంగా కరుగుతాయి:**
పరిశోధన ప్రకారం, బరువు తగ్గడానికి, మీరు వ్యాయామం ద్వారా వారానికి కనీసం 2 వేల కేలరీలు బర్న్ చేయాలి. స్థిరమైన, క్రమం తప్పకుండా సైక్లింగ్ చేయడం వల్ల ప్రతి గంటకు 300 కేలరీలు బర్న్ అవుతాయని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు.



### సైకిల్ తొక్కడం వల్ల..

**సైకిల్ తొక్కడం వల్ల కీళ్లకు సపోర్ట్ లభిస్తుంది. దీంతో కీళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. ఆయా భాగాల్లో ఉండే వాపులు, నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. సైక్లింగ్ మీ బరువును కంట్రోల్‌లో ఉంచుతుంది ప్రతిరోజూ సుమారు 30 నిమిషాల పాటు సైకిల్ తొక్కితే.. ఒక ఏడాదిలో దాదాపు ఐదు కిలోల కొవ్వును కరిగిస్తుందట.**

## పుచ్చకాయ వీరికి
# విషంతో సమానం..





**కిడ్నీ బాధితులు:** కిడ్నీ సమస్యలు ఉన్నవారు పుచ్చకాయకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఇందులో పొటాషియం మోతాదు చాలా ఎక్కువగా ఉంటుంది. కిడ్నీలు సరిగ్గా పనిచేయనప్పుడు ఈ పొటాషియంను ఫిల్టర్ చేయడం కష్టమవుతుంది. శరీరంలో పొటాషియం పెరిగితే కండరాల బలహీనత, విపరీతమైన అలసట వస్తాయి. ఇది గుండె లయను తప్పించి, శరీరంలో వాపులకు దారితీస్తుంది. ముఖ్యంగా డయాలసిస్ చేయించుకునే వారు దీనికి దూరంగా ఉండాలి.

**మధుమేహం:**
పుచ్చకాయ తీయగా ఉండటమే కాదు..దీని గ్లైసెమిక్ ఇండెక్స్ కూడా చాలా ఎక్కువ. ఇది తిన్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. ఆ తర్వాత అంతే వేగంగా పడిపో తాయి. దీనివల్ల డయాబెటిస్ ఉన్నవారికి తల తిరగడం, నీరసం వంటి సమస్యలు తలెత్తుతాయి. వైద్యుల సలహా లేకుండా వీటిని తీసుకోకపోవడమే ఉత్తమం.

**కాలేయ వ్యాధులు:**
లివర్ సమస్యలు ఉన్నవారికి పుచ్చకాయలోని ఫ్రక్టోజ్ జీర్ణం కావడం కష్టమవుతుంది. ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు పుచ్చకాయ తింటే కాలేయం చుట్టూ మంట పెరిగే అవకాశం ఉంది. ఆల్కహాల్ తీసుకోని



వారికి వచ్చే ఫ్యాటీ లివర్ బాధితులు కూడా జాగ్రత్తగా ఉండాలి.

**ఆస్తమా - అలెర్జీలు..**
**ఆస్తమా ఉన్న రోగులలో పుచ్చకాయల్లోని కొన్ని ఎంజైమ్‌లు ఓరల్ అలెర్జీ సిండ్రోమ్‌ను ప్రేరేపిస్తాయి. గొంతులో గర గర, శ్వాసనాళాల్లో వాపు రావచ్చు. అలెర్జీలు ఉన్నవారు ఈ పండును తినే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి.**

**జీర్ణక్రియ సమస్యలు:**
అసిడిటీ, గ్యాస్ లేదా IBS ఉన్నవారికి పుచ్చకాయ ఇబ్బందులను కలిగిస్తుంది. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉన్నప్పటికీ, సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో ఇది కడుపు నొప్పి, ఉబ్బరం, అజీర్ణానికి కారణమవుతుంది.

# శొంఠిని ప్రతిరోజూ నీటిలో కలిపి తాగడం..!

**మన వంటగదిలో తరచుగా కనిపించే అల్లం, ఆరోగ్యానికి ఎంతో మంచిది. అయితే, తాజా అల్లం కంటే ఎండిన అల్లం ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుందని పోషకాహార నిపుణులు వెల్లడిస్తున్నారు. ఈ శొంఠిని ప్రతిరోజూ నీటిలో కలిపి తాగడం వల్ల లెక్కలేనన్ని ఆరోగ్య లాభాలు కలుగుతాయని వారు సూచిస్తున్నారు.**

ఎండిన అల్లం ముఖ్యంగా బరువు తగ్గాలనుకునేవారికి అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీర కొవ్వును కరిగించే సామర్థ్యం దాదాపు 10 శాతం పెరుగుతుంది. ఎండిన అల్లంతో తయారు చేసిన హెర్బల్ టీ తాగడం వల్ల శరీరం దాదాపు 90 నుండి 110 కేలరీలు ఎక్కువగా బర్న్ చేస్తుందని అనేక అధ్యయనాల ఫలితాలు చూపించాయి. తద్వారా కొన్ని వారాల్లోనే 1 నుంచి 1.5 కిలోల బరువు



తగ్గవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది కేలరీలను అధికంగా బర్న్ చేయడానికి కూడా తోడ్పడుతుంది.

బరువు తగ్గడమే కాకుండా, ఎండిన అల్లం నొప్పి, వికారం లాంటి సమస్యల నుంచి గణనీయమైన ఉపశమనం కలిగిస్తుంది. మైగ్రేన్ తలనొప్పిపై జరిపిన అధ్యయనాల్లో, అల్లం నొప్పి తీవ్రతను, వికారం వచ్చే ఫీలింగ్‌ను తగ్గిస్తుందని చెబుతున్నారు. మైగ్రేన్ తలనొప్పి, గర్భధారణ సంబంధిత వికారం, మోషన్ సిక్‌నెస్ లాంటివి తగ్గిస్తుంది. అల్లం ఎండినప్పుడు, అందులోని జింజరాల్స్ షోగోల్స్‌గా మారి, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను పెంచుతాయి. ఇవి శరీరంలో వేడిని ఉత్పత్తి చేసి, బ్రౌన్ ఫ్యాట్‌ను యాక్టివేట్ చేయడం ద్వారా కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి. ఒక కప్పు వేడి నీటిలో అర టీస్పూన్ నుండి ఒక టీస్పూన్ ఎండు అల్లం పొడిని కలిపి ఉదయాన్నే తాగడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుంది. అయితే ఉద యాన్నే ఎండిన అల్లం నీరు తాగడం అత్యంత ప్రయోజనకరంగా ఉంటుంది. ఉదయం దీనిని తీసుకోవడం వల్ల మెటబాలిజంపెరుగుతుంది. మైగ్రేన్లు లేదా వికారం వంటి సమస్యల కోసం అయితే, భోజనం తర్వాత కూడా ఈ నీటిని తాగవచ్చు. క్రమం తప్పకుండా శొంఠిని మీ డైలీ రొటీన్‌లో భాగం చేసుకోవడం మంచిదని చెబుతున్నారు వైద్య నిపుణులు.

## స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 15 (నినాదం):** రాజేంద్ర నగర్ నియోజక వర్గం పరిధిలోని నార్సింగి సర్కిల్ మున్సిపాలిటీ లోని మంచి రేవుల పురాతన దేవాలయం డివిజన్ పరిధిలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా దేవాలయాలలో మచిలేశ్వర స్వామి ప్రత్యేక పూజ కార్యక్రమంలో రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు ఆ పరమశివుడి ఆశీస్సులతో సకల శుభాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖశాంతులు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నియోజకవర్గం ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దారి చూపిన దార్శనికుడు సేవాలాల్ మహారాజ్



**కొడంగల్, ఫిబ్రవరి 15(నినాదం):** లంబాడీ గిరిజన ప్రజల అభ్యున్నతికి దారి చూపిన దార్శనికుడు సేవాలాల్ మహారాజ్ అని సేవాలాల్ సంఘం నాయకులు కొనియాడారు. సేవాలాల్ జయంతి సందర్భంగా ఆదివారం బొంరాస్ పేట్ మండల పరిధిలోని బొట్లవాణి తాండలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భోగ్ బండారో పూజా కార్యక్రమం నిర్వహించిన అనంతరం సేవాలాల్ సంఘం నాయకులు మాట్లాడుతూ, ప్రసార మాధ్యమాలు అందుబాటులో లేని ఆరోజుల్లో సంత్ సేవాలాల్ గిరిజనుల చెంతకు చేరి సంఘాలను ఏర్పాటు చేసి గిరిజన ప్రజలను చైతన్యం చేశారని గుర్తుకు చేసుకున్నారు. విచ్ఛిన్నమైన గిరిజనులను సంఘటితం చేసేందుకు ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. గిరిజనుల సాంస్కృతి, సంప్రదాయ ఆచారాలను చాటిచెప్పిన మహనీయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సంఘం నాయకులు నెహ్రూ నాయక్, బాలు నాయక్, రవి నాయక్, చందర్ నాయక్, ఫుల్ సింగ్, రాజు నాయక్, నార్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### జవహర్‌నగర్ శివాలయాల్లో..

## భక్తుల కోలాహలం

### అంగరంగ వైభవంగా శివరాత్రి వేడుకలు



**జవహర్ నగర్, ఫిబ్రవరి 15 (నినాదం):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జవహర్ నగర్ లోని పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆదివారం ఉదయం నుండే ఆలయాల్లోని భక్తులు క్యూ లైన్ లో నిలబడి మహా శివుడిని దర్శించుకున్నారు. భక్తి పారవశంతో ప్రజలు ఉపవాసాలతో శివ నామస్మరణతో ఆ బోలా శంకరుని స్మరిస్తూ భక్తి సంద్రంలో తేలియాడారు. ఆదివారం జవహర్ నగర్ లోని భక్తులు శివరాత్రి జాగారాలు చేస్తూ భజనలు సంకీర్తనల్లో మునిగిపోయారు. పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక ప్రభ ఉట్టి పడింది. ఉపవాసాలతో భక్తులు శివ శివ అంటూ తలుచుకున్నారు.

# ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి

### బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్

### జవహర్‌నగర్ సేవాలాల్ అధ్యక్షుడు అంగోత్ రవి నాయక్





**జవహర్‌నగర్, ఫిబ్రవరి 15 (నినాదం):** బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాలేనని జవహర్ నగర్ సేవాలాల్ అధ్యక్షుడు అంగోత్ రవి నాయక్ తెలిపారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో ఘనంగా సేవాలాల్ సమితి ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జవహర్ నగర్ సేవాలాల్ సంఘం అధ్యక్షుడు అంగోత్ రవి నాయక్ హాజరై మాట్లాడుతూ. సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాల ఆరాధ్య దైవం హిందూ ధర్మం గొప్పతనం బంజారాలకు తెలియజేయడానికి జన్మించిన మహానుభావుడిగా బంజారుల జాతిపితగా భావిస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈయన చిన్ననాటి నుండి జగదాంబ భక్తుడని వీరికి దాదాపు ఆ 16 వేల గోవులు ఉన్నట్లు కథలు చెప్పుకుంటారని తెలిపారు. సేవాలాల్ మహారాజు నివసిస్తున్న గుత్తి ప్రాంతంలో ఒకసారి కరువు వచ్చింది. తన గోవులను రక్షించుకోవడం కోసం అక్కడి నుండి కర్ణాటకలోని బళ్లారికి వలస వెళ్లాడని జగదాంబ సంకల్పం చేత బంజారాలను ఆపదల నుండి కరువు నుండి వివిధ రుగ్మతలు రాకుండా ఉండడం కోసం లంబాడి జాతిని జాగృతం చేయడానికి పాటించవలసిన ధర్మాలను పూజించవలసిన దేవతలను భారత దేశమంతా తిరిగి ప్రచారం చేశాడని తెలిపారు. ఆయన ప్రతి సందర్భంలో బంజారాలను ఉద్దేశిస్తూ నా చేత జగదాంబే ఈ మాటలు పలికిస్తుందని చెప్పేవారు. భారతదేశంలో ఉన్న బంజారా లందర్నీ ఏక త్రాటిపైకి తేవడానికి ప్రయత్నం చేశాడన్నారు. అలాగే బంజారాలు అందరూ శాకాహారాన్ని మాత్రమే స్వీకరించాలని ఒక ఉద్యమాన్ని కూడా తీసుకువచ్చిన మహానుభావుడు తెలిపారు. సంతసేవాలాల్ మహారాజ్ మాంసాహారం పేరుతో పాటు మందు మత్తు పదార్థాలు తీసుకోరాదని బంజారా ప్రజలకు హితోపదేశం చేశాడన్నారు. భారతదేశమంతా తిరుగుతున్న క్రమంలోనే మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతం తెలంగాణ ప్రాంతాన్ని దర్శించాడని వివిధ ప్రాంతాల ను దర్శించినప్పుడు ఇతనికి అనేకమంది శిష్యులు తయారైనారని తెలిపారు. వారిలో బంజారా వ్యక్తులే కాకుండా బంజారేతరులు కూడా ఉన్నారని తెలిపారు. సంతు సేవాలాల్ మహారాజు తోటి మనుషులను గౌరవించండి ప్రేమించండి అని హితోపదేశం చేసేవారని తెలిపారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని డీజే ఆట పాటలతో భారీ ర్యాలీ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బంజారా ఉపాధ్యక్షులు ఆర్ రాజు నాయక్, ఎల్ రాము లాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి ఎం చందు నాయక్, ఏం రాజు నాయక్, సంయుక్త కార్యదర్శి ఆర్ శ్రీను నాయక్, ఏ రవీందర్ నాయక్, బి రవీందర్ నాయక్, కోశాధికారి కే చందు నాయక్, ఉమ్మడి కార్యదర్శి బి రెడ్యానాయక్, జే రమేష్ నాయక్, దర్గయ్య నాయక్, సలహాదారులు సక్రు నాయక్ దశరథ్ నాయక్, చందు నాయక్, రెడ్యా నాయక్, కే సంగ్యా నాయక్ ఎల్ రామ నాయక్, ఎల్ లక్ష్మ నాయక్ బి శ్రీను నాయక్, పి గోపాల్ నాయక్, రమేష్ రాథోడ్, వెంకటేష్ రాథోడ్, గోవిందు చౌహాన్, శంకర్ చోహన్, ఆర్కే సుభాష్, డి శ్రీను నాయక్, ఎల్ రవి నాయక్, ఎం మాన్య నాయక్, డి లక్ష్మణ్ నాయక్, బాదావత్ హనుమంతు, గుగులోతు బాలు నాయక్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కౌన్సిలర్ క్యాంపులో కానిస్టేబుల్‌ను నిలదీసిన నాయకులు



**వికారాబాద్, ఫిబ్రవరి 15(నినాదం ):** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో జిల్లా పరిధిలోని పరిగి మున్సిపల్ ఫలితాల్లో హంగ్ ఏర్పడిన విషయం విధితమే అయితే బి ఆర్ ఎస్ కౌన్సిలర్ శిభిరంలో ఉన్న కొందరు కౌన్సిలర్ల జాడ తెలుసుకున్న పోలీసులు మఫ్టీ లో పోలీస్ కానిస్టేబుల్ శిభిరంలోకి వెళ్ళి వివరాలను చేరవేయాలని చూశారు. దీంతో పసిగట్టిన శిభిరం నిర్వాహకులు అనుమానస్పద స్థితిలో ఉన్న వ్యక్తిని నిలదీశారు. నాది వేటపాలెమని సామాధానం ఇచ్చిన సదరు వ్యక్తి బాషాపై అనుమానం వచ్చి మరింత గట్టిగా నిలదీయాడంతో దీంతో నేను పోలీస్ కానిస్టేబుల్ అని ఎస్ఐ పంపించారని సమాధానం ఇవ్వడంతో కంగు తిన్న నాయకులు ఈ పరిణామంపై కానిస్టేబుల్ ను ప్రశ్నించారు. అధికార పార్టీకి కొమ్ముకాస్తూ ఈలాంటి చర్యలకు పాల్పడటం ఎంత వరకు సమంజమని వారు అన్నారు. అధికార దుర్వినియోగం చేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు. ప్రజలు ఈ విషయాన్ని పూర్తి స్థాయిలో గమనించాలని నాయకులు కోరారు.

## బాచుపల్లి హిల్ కౌంటీ రిలే నిరాహార దీక్షను సందర్శించిన ఎంపీ ఈటల రాజేందర్





### • అండగా ఉంటానని హామీ

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి లోని హిల్ కౌంటీ విల్లాస్ మహిళలు చేపట్టిన శాంతియుత రిలే నిరాహార దీక్షను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దీక్షలో పాల్గొన్న మహిళలతో మాట్లాడి, సమాజంలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సమాజంలో చోటు చేసుకుంటున్న ఆర్థిక అవకతవకలపై న్యాయమైన పారదర్శకమైన దర్యాప్తు జరపాలని బాచుపల్లి పోలీసులకు ఎంపీ ఈటెల రాజేందర్ సమక్షంలో ప్రతినిధి పత్రం అందజేశారు. దేశవ్యాప్తంగా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ల పరిపాలనను బలోపేతం చేయడానికి సంబంధిత చట్టాలలో సంస్కరణలు చేయాలని జాతీయస్థాయి ప్రతినిధి పత్రం సైతం అందజేశారు. హిల్కౌంటి మహిళలు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ఎంపీ ఈటెల రాజేందర్ సంపూర్ణ మద్దతు తెలపడంతో తమ సమస్యలకు త్వరితగతిన న్యాయపరమైన పరిష్కారం లభిస్తుందని మహిళలు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రిలే నిరాహార దీక్ష చేపట్టిన నవత, తనుజ, జ్యోతి, భరణి, రేణుకా దేవి, విజయ, కవిత, మంజుల కు సంఘీభావంగా పార్లమెంట్ సభ్యులు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటెల రాజేందర్ తో పాటు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లి మాధవి, బాచుపల్లి మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, నిజాంపేట్ అధ్యక్షులు ప్రసాద్ రాజు, బిక్షపతి, నరేంద్ర చౌదరి, చక్రధర్ సాయి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న విజయరామరెడ్డి



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15 (నినాదం):** జగద్గిరిగుట్ట పై కొలువై వున్న సంత్ సేవాలాల్ మహారాజ్ 287 జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కె జగన్ తో 125 డివిజన్ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డి. విజయ్ రామ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భాస్కర్ ముదిరాజ్, సంతోష్ స్థానిక సేవాలాల్ కమిటీ మెంబర్స్ లక్ష్మీ బాయి, తారాసింగ్ నాయక్, రమేష్ నాయక్, రవి నాయక్, శ్రీను నాయక్, నరేష్ నాయక్, శివ నాయక్ త తదితర నాయకులు పాల్గొన్నారు.

### మచిలేశ్వర స్వామిని దర్శించుకున్న పీసీసీ అధ్యక్షుడు



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 15 (నినాదం):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం మంచిరేవుల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మచిలేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకున్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహేష్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏటా ఆనవాయితీగా మచిలేశ్వర స్వామిని దర్శించుకుంటున్నానని, ఈ ఏడాది కూడా కుటుంబ సమేతంగా రావడం సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ మహాశివుడిని వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గండిపేట మండల అధ్యక్షుడు అశోక్ యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, నార్సింగి మాజీ మున్సిపల్ చైర్మన్ నాగపూర్ణ శ్రీనివాస్, బండ్లగూడ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పొన్న రమేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ



**కాప్రా, ఫిబ్రవరి 15 (నినాదం) :** ఇనాయా చారిటబుల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాబోయే పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పేద ప్రజలకు ఉపకారంగా 500 కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందిస్తాయని, పేదల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఇనాయా చారిటబుల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు ఎం.కె. బద్రుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్, సయ్యద్ అఫ్సర్, మజీద్ సాహెబ్, అలీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుదాం

### సమ సమాజ స్థాపన కోసం కృషి చేద్దాం

### సీనియర్ నాయకులు కల్లేపల్లి సదానంద్, బూడిద వెంకటేష్



**జవహర్ నగర్, ఫిబ్రవరి 15 (నినాదం):** మహనీయుల ఆశయాలకు అనుగుణంగా కలిసికట్టుగా కృషిచేసి సమ సమాజాన్ని నిర్మిద్దామని సీనియర్ నాయకులు కల్లేపల్లి సదానంద్ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి మహంకాళి బిక్షు ఆధ్వర్యంలో నిర్విరామంగా తలపెట్టిన 79వ జ్ఞానమాల కార్యక్రమం జవహర్ నగర్ బాలాజీ నగర్ లో ఆదివారం ప్రముఖుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ నాయకులు కల్లేపల్లి సదానంద హాజరై మాట్లాడుతూ, ప్రైవేటు విద్యా వైద్య రంగంలో ఉద్యోగాల కల్పనకై రిజర్వేషన్లు అమలుకై పోరాడదామని అంబేద్కర్ కలలు కన్న సమ సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగంపై అవగాహన పెంపు కొరకు జూలై 12వ తేదీన ప్రముఖ వక్తలచేభారీ కార్యక్రమాన్ని నిర్వహించాలని తలపెట్టడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్య హక్కు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు కర్షకులకు సబ్బండ వర్గాలకు మేలు చేసే సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయాలని కార్మిక చట్టం ప్రకారం వేతనాలు పత్రికా రంగంలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఇండ్లు వైద్య సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థలలో విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించాలని అంబేద్కర్ కలలుగన్న సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొయ్యడ వెంకటేష్, కొమ్ము ఇలా కాంత్, సామాజిక సేవకులు బూడిద వెంకటేష్, గాద రమేష్, బిర్రు ఏక సామి, ప్రేమల శ్రీనివాస్, డాక్టర్ గడ్డం శ్రీనివాసులు, గడ్డం గిరి ,ఎర్ర రమేష్, స్వామి, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలో పాల్గొన్న బొంతు శ్రీదేవి



**కాప్రా, ఫిబ్రవరి 15 (నినాదం) :** కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ పరిధిలోని కృష్ణారెడ్డి నగర్ బంజారా కాలనీలో ఉన్న శ్రీ కనక దుర్గమ్మ దేవాలయం నందు బంజారా వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలలో మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించి, బంజారా సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పదవికి కులాలను లాగవద్దు



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 15(నినాదం ):** మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ పదవి విషయంలో కుల ప్రాతిపదికను ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయరాదని మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. ఆదివారం ఆయన స్థానికంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ తమ కుటుంబం గత ఆరు దశాబ్దాలుగా ప్రజలతో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటూ ప్రజా మద్దతుతో వివిధ పదవులు అధిరోహించామని తనకు కుల ప్రాతిపదికన ఎలాంటి పదవులు రాలేదని కొంతమంది వ్యక్తులు కేవలం ఆర్యవైశ్యుల్ని లక్ష్యంగా చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలతో కులాల మధ్య పంచాయతీ లు పెడుతున్నారని, తమ హయాంలో ప్రజా మద్దతుతోనే పదవులు చేపట్టామని ఎటువంటి కులాల ప్రస్తావనలేదన్నారు.

## మహాశివరాత్రి వేడుకల్లో కొలను హనుమంత రెడ్డి ప్రత్యేకపూజలు



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట శ్రీ మల్లికార్జున స్వామి భ్రమరాంబ కేతమ్మ ఆలయం లో మహాశివరాత్రి ఉత్సవాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాదేవపూర్ డివిజన్ లో వెలిసిన శ్రీ శ్వేత లింగేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు మహా శివుడి నామస్మరణతో మారుమోగాయి. ఈ కార్యక్రమం లో డిసిసి ఉపాధ్యక్షులు ధమ్మని శ్రావణ్ కుమార్, మైసి గారి శ్రీనివాస్, ఆమేర్, చంద్రయ్య, శ్రీలత, డివిజన్ అధ్యక్షులు గణేష్, రషీద్, సిద్దనోల సంజీవరెడ్డి రెడ్డి చంద్రయ్య, రవి ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ మరకత లక్ష్మీ గణపతి ఆలయంలో ప్రత్యేకపూజలు



**అల్వాల్, ఫిబ్రవరి 15 (నినాదం) :** కానాజీ గూడ డైరీ ఫామ్ రోడ్లో వెలిసిన ప్రపంచంలోనే అరుదైన మరకత శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో మహాశివరాత్రి రోజున జగద్గురువు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య అర్చిత మహా స్ఫటిక లింగానికి ,భక్తులచే ఏకాదశ రుద్రాభిషేకం ,రుద్ర హోమం, బిల్వార్చనలు, శివార్చన సభక్తి పూర్వకంగా నిర్వహించిన డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి. ఆయన మాట్లాడుతూ శివ అభిషేకం లో పాల్గొన్న వారికి గ్రహ దోషాలు ఈతి బాధలు తొలగిపోతాయని తెలియపరిచారు.

## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



**అల్వాల్, ఫిబ్రవరి 15 (నినాదం):** మహాశివరాత్రి పురస్కరించుకుని అల్వాల్ సర్కిల్లోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జామున నుండే భక్తులు బారులు తీరారు ప్రత్యేక అర్చనలు అభిషేకలలో పాల్గొన్నారు.

## దేవేంద్ర నగర్ చౌరస్తాలో ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం మహాదేవపురం డివిజన్ దేవేందర్ నగర్ చౌరస్తాలో బంజారా సోదరులు సంత్ సేవాలాల్ మహారాజ్287 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బంజారా సోదరుల ఆధ్యాత్మిక గురువు, ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ చెప్పిన మార్గంలో నడవాలని పలువురు వక్తలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా గుత్తి మండలంలో రాంజీ నాయక్ తండాలో జన్మించిన గొప్ప నాయకులు సేవాలాల్ మహారాజ్ అని ఆయన బంజారా కుటుంబాలను. చైతన్యవంతులు చేసిన సంఘటనలను వివరించారు. ఈ కార్యక్రమంలో సాతాల గోపాల్, బోదాస్ శ్రీనివాస్, ఈ ప్రాంత నాయకులు, బంజారా వాసులు పాల్గొన్నారు.

## పలు శివాలయాలను దర్శించుకున్న కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 15 (నినాదం):** శివరాత్రి పర్వదిన సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని పలు శివాలయాలను మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ దర్శించుకుని ఆ పరమశివుడికి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ పరమశివుడి అనుగ్రహంతో ప్రజల అందరి జీవితంలో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో చీకటిని పారదోలి అందరి జీవితాల్లో కాంతులను నింపాలని ఆకాంక్షించారు. మహాశివరాత్రి వేడుకలు సందర్భంగా దేవాలయాల పరిసరాలు భక్తుల శివనామ స్మరణతో మార్మోగుతూ శోభాయమానంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

